క్లుప్తంగా

సీఆర్‌టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు సీఆర్‌టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్)ల నియామకానికి అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ, తరగతి నుంచి 7వ, తరగతి వరకు ఏ జిల్లాలో చదివారో ఆ జిల్లాలో స్థానిక అభ్యర్థులు పరిగణించబడుతారని, ఎస్‌ఏ గణితం, సాంఘిక శాస్త్రం బోధించడానికి డిగ్రీ, బీఎడ్, టెట్ పేపర్-2 కలిగిన వారు, ఎస్జీటీ కోసం ఇంటర్, డీఎడ్, బీఏ, టెట్ పేపర్-1 కలిగిన అభ్యర్థులు అర్హులని అన్నారు. అభ్యర్థులను రాత పరీక్ష, డెమో, మౌఖిక పరీక్ష ద్వారా ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 14వ, తేదీన సమీకృత కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 8309183353 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రాల్లో సాధారణ మరమ్మతు కారణంగా మండల కేంద్రంతో పాటు రేమద్దుల, కేతేపల్లి, మాందాపూర్, చిక్కేపల్లి, బుసిరెడ్డిపల్లి ఉప కేంద్రాల పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.
గోపాల్‌పేట: రేవల్లి, గోపాల్‌పేట మండలాల్లో ఆదివారం పవర్‌కట్ ఉంటుందని గోపాల్‌పేట ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వనపర్తి సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ ఉన్నందున గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని 27 గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పదకొండు గంటల వరకు పవర్‌కట్ ఉంటుందని, రెండు మండలాల ప్రజలు సహకరించాలని కోరారు.

17 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

కొత్తకోట: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఈ నెల 17 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. మండలంలోని పీఈటీలతో శనివారం స్థానిక ఎంఆర్సీ భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల కోసం అండర్-14, అండర్-17 స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని పీఈటీలకు సూచించారు.

పాఠశాలకు డ్రమ్స్ సెట్ వితరణ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు శనివారం డ్రమ్స్, కబడ్డీ క్రీడాకారులకు 23 జతల క్రీడా దుస్తులు పాఠశాలకు వితరణ చేశారని హెచ్‌ఎం కురుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి కోసం మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ప్రవీణ్, శ్రీకాంత్, శ్రీరామ్, షాహిద్, పాషా, జస్వంత్, భాను, శివ, సతీష్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

పెబ్బేరు రూరల్: మండల పరిధిలోని పాత సూగూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తి దంపతులు బస్‌పాసులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సూగూర్‌కి ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించడంతో పాటు తమ సొంత ఖర్చులతో 100 మంది విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు, నోటుబుక్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల బృందం కలిసి ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

జిల్లాస్థాయి వ్యాసరచనలో ప్రతిభ

అమరచింత: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో శనివారం 'చేనేత రంగం.. పరిరక్షణ' అనే అంశంపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివే విద్యార్థి వగ్గు శ్రీరాం పాల్గొని రెండో బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం బలరాముడు తెలిపారు. ఆగస్టు 7న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో బహుమతి అందించనున్నట్లు వివరించారు.

విద్యార్థినికి ఘన సన్మానం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి(9.5 జీపీఏ) పూర్తి చేసిన వసంత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ బృందం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా సమయాన్ని వృథా చేయకుండా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


అమడబాకులలో తల్లిపాల వారోత్సవంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్ఠమైనవని, ఆరోగ్యవంతమైనవని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. శనివారం అమడబాకుల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక హాజరై మాట్లాడారు. ముర్రుపాలు తాగిస్తే శిశువు శరీరంలోని మలినాలను తీసివేసి మూత్ర విసర్జన రూపంలో బయటకు పంపిస్తాయన్నారు. ఆరు నెలల లోపు ఎటువంటి పానియాలను చిన్నారులకు ఇవ్వకూడదన్నారు. సర్పంచ్ బుచ్చన్నతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.
పెబ్బేరు రూరల్: మండల పరిధిలోని రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.
పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్, దొండాయిపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసియాబేగం తెలియజేశారు. అనంతరం ఆయా కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు రాణి, శ్యామల, సంతోషమ్మ పాల్గొన్నారు.


శ్రీరంగాపురం ఎంఆర్సీ భవనంలో సీమంతాలు


గోప్లాపూర్‌లో వారోత్సవాల ర్యాలీ

గర్భిణుల్లో మానసిక స్థైర్యాన్ని నింపాలి

వనపర్తి: గర్భిణులు బాలింతల్లో మానసిక స్థైర్యాన్ని నింపినప్పుడే వారు ఆరోగ్యకరంగా జీవిస్తారని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. శనివారం పీపనగండ్లలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వార రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర పోషక విలువలతో కూడిన పదార్థాలను పంపిణీ చేస్తుందని, ఈ పదార్థాలు సద్వినియోగం అయ్యేలా అంగన్‌వాడీ టీచర్లు చూడాలన్నారు. గ్రామాల్లోని మహిళలను చైతన్యపరిచి మూఢవిశ్వాసాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలదేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సీడీపీఓ లక్ష్మమ్మ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

పెబ్బేరు రూరల్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీగా, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సర్పంచ్ వినీలా రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి హాజరై తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల్లు, ఆశ వర్కర్ భాగ్యలక్ష్మి, బాలింతలు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

అమరచింత: ప్రభుత్వం ప్రకటించిన విధంగా గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులైన పేదలందరిని ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వార రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో వర్షాలకు కూలిన ఇళ్లకు మాత్రమే గృహలక్ష్మి వర్తింపజేస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. రేషన్ బియ్యం కేవలం నెలకు ఐదు కిలోల ప్రకారం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, కురుమన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న తహసీల్దార్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని తహసీల్దార్ పాండు నాయక్ అన్నారు. శనివారం మండలంలోని అప్పారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సర్పంచ్ కృష్ణవేణితో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మున్ముందు ఉన్నతంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో సర్వే నంబర్ 4, 5లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. త్వరలోనే గతంలోని లిస్టు ప్రకారం లబ్ధిదారులకు ప్లాట్లు ఇస్తామన్నారు. సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, సంజీవ, నవీన్ పాల్గొన్నారు.

'కడుకుంట్లను మండలం చేయాలి'

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని 10 వేల జనాభా ఉన్న కడుకుంట్ల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం గ్రామంలో సాధన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ గ్రామానికి ఎన్‌హెచ్ 44 దగ్గరగా ఉందని, 7 కిలోమీటర్ల దూరంలో చుట్టూ 17 గ్రామాలు, భవనాలకు అవసరమున్న ప్రభుత్వ భూమి, ప్రభుత్వ ఆస్పత్రి, గురుకుల పాఠశాల, బ్యాంక్ అన్ని వసతులు ఉన్న గ్రామం మండల కేంద్రం ఏర్పాటుకు నోచుకోవడం లేదన్నారు. మంత్రి గ్రామానికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, బుచ్చిరెడ్డి, రామ్‌రెడ్డి, రవికిరణ్, గోవర్ధన్, కృష్ణకుమార్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.


కడుకుంట్లలో దీక్ష చేస్తున్న నాయకులు

నూతన తహసీల్దార్‌గా లక్ష్మి

పెబ్బేరు రూరల్: మండల నూతన తహసీల్దార్‌గా లక్ష్మీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గతంలో పనిచేస్తున్న తహసీల్దార్ అబ్రహాం లింకన్ మదనాపూర్‌కు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో నిజాంబాద్ జిల్లా నుంచి లక్ష్మి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విధులపై ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఖిల్లాఘనపురం: మండల నూతన తహసీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ పాండునాయక్‌ను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభాకర్‌రెడ్డి, వాసనాగేశ్వర్, డాక్టర్ నరేందర్‌గౌడ్, కృష్ణయ్య యాదవ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని నిరాశ్రయులకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చిన్న మందడి, గట్లఖానాపూర్, అమ్మపల్లి గ్రామాల్లో మిద్దెలు, గుడిసెలు పడిపోవడంతో ఇంట్లోని వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిరాశ్రయులైనటువంటి వారికి మేమున్నామంటూ రెడ్ క్రాస్ సొసైటీ వారు ముందుకు వచ్చి వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు అందజేశారు.


చిన్నమందడిలో వంట సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: ఇరువర్గాలు ఘర్షణ పడి ఒకరిపై దాడి చేసిన సంఘటనపై శనివారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన బోయిని శాంతయ్య ఇంటి ఎదుట ఉన్న గుంతలో శుక్రవారం సమీపంలోని బోయిని లక్ష్మయ్య కట్టెలు వేశాడు. కట్టెలు ఎందుకు వేశారని ప్రశ్నించాడు. దీంతో శాంతయ్యపై కట్టెతో లక్ష్మయ్య దాడి చేశాడు. తలకు తీవ్ర రక్తగాయమైంది. ఈ సంఘటనపై బాధితుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మయ్య, అతని తల్లి రత్నమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సోళీపురం విద్యార్థి


విద్యార్థితో హెచ్‌ఎం, పీఈటీ

ఖిల్లాఘనపురం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎంపికయ్యాడని పాఠశాల హెచ్‌ఎం అజీమ్ బాషా, పీఈటీ మన్యం తెలియజేశారు. జూలై 30న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థి ముడావత్ మోహన్ అండర్-16 జావెలిన్ త్రో లో ప్రతిభ కనబరిచాడని చెప్పారు. ఈ నెల 7, 8 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం, పీఈటీతో పాటుగా సర్పంచ్ పద్మశ్రీ, తదతరులు విద్యార్థిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి మీడియా వర్క్ షాప్‌కు తరలిన నాయకులు

వనపర్తిటౌన్: రాష్ట్ర స్థాయి మీడియా వర్క్‌షాపులో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి శనివారం బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ప్రకాశ్‌జవదేకర్ ముఖ్యఅతిథిగా హాజరైన మీడియా వర్క్‌షాపుకు జిల్లా నుంచి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, జిల్లా అధికారి ప్రతినిధి పెద్దిరాజు, నాయకులు మణివర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పగిడాల పరామర్శ

పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెంకు చెందిన నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో శనివారం కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు గోపాలకృష్ణ నాయుడు, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఆత్మకూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నాయకులు జీవేంద్రుడు, శివకుమార్, సాయిలు, అనిల్, శ్రీనివాసులు, కమలాకర్ అన్నారు. శనివారం ఆత్మకూర్ నుంచి హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు తరలివెళ్లారు. సీఎం కేసీఆర్ కలుగజేసుకుని డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

కూలిన మట్టి మిద్దె

వనపర్తి: పీపనగండ్లకి చెందిన తెలుగు కొత్త పెద్ద మౌలాలీ మిద్దె శనివారం సాయంత్రం కూలిపోయింది. వారం రోజులుగా కురిసిన వర్షానికి బాగా తడిసిన మట్టి మిద్దె శనివారం ఉన్నపలంగా కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఇంటి ఆవరణలో ఉండటంతో పెనుప్రమాదం తప్పింది.



కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే కేసులు

ఖిల్లాఘనపురం: కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. శనివారం మండలంలోని సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాల శివారులో కరిగెట్లు చేస్తున్న ట్రాక్టర్ల వద్దకు వెళ్లి డ్రైవర్లతో మాట్లాడి అవగాహన కల్పించారు. రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వం బీటీ రోడ్లు వేస్తుందన్నారు. అది అర్థం చేసుకోకుండా ఇష్టానుసారంగా రోడ్లపై కేజీవీల్స్ తిప్పడంతో బీటీ పగిలిపోయి రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని అన్నారు. కేజీవీల్స్‌తో రోడ్లపైకి వస్తే కచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.


సల్కెలాపురం శివారులో ట్రాక్టర్ యజమానికి సూచనలు చేస్తున్న పోలీసులు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పెబ్బేరు రూరల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాధవి మాట్లాడారు. గ్రామంలో వర్షాకాలంలో వస్తున్న వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు 296 పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కొండన్న, సిబ్బంది నాగమణి, జలీల్, కరుణాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.
పాన్‌గల్: మండలంలోని మాందాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లో రెండో రోజు శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ పేర్కొన్నారు.


మియాపూర్‌లో టీకాలు వేస్తున్న సిబ్బంది

హైదరాబాద్ తరలిన జూపల్లి అనుచరులు

పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మాజీ మంత్రి జూపల్లికి స్వాగతం పలికేందుకు శనివారం మండలం నుంచి ఆయన అనుచర వర్గం వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. రంగానాయక్, జయకళ, సింధూజ, రాణి, జయరాములుసాగర్ తరలివెళ్లారు.
వనపర్తి: జూపల్లి కృష్ణారావు శనివారం హైదరాబాద్‌కు రానున్న సందర్భంగా పీపనగండ్ల మండలంలోని వివిధ గ్రామాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి అభిమానులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పెంటయ్య, వెంకటస్వామి, నర్సింహ పాల్గొన్నారు.


గోవర్ధనగిరి నుంచి తరలిన జూపల్లి అభిమానులు

రోడ్డు పనులు ప్రారంభం

వనపర్తి: పీపనగండ్ల మండల పరిధిలోని గోపల్‌దిన్నెలో రూ.10 లక్షలతో నిర్మించనున్న మట్టి రోడ్డు పనులను శనివారం మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, సర్పంచ్ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ కుర్మయ్య ప్రారంభించారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని, రోడ్డు పనులు పూర్తయితే రైతులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రోడ్డును వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, నిరంజన్, శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కాశీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంపై శనివారం మూడో రోజు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను బోధన ద్వారా విద్యార్థులకు తెలియజేసి వారి సామర్థ్యాలను పెంచాలన్నారు. గణిత సబ్జెక్టుపై ఆర్పీలు సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మద్దిలేటి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రోడ్లు శుభ్రం చేస్తూ.. కార్మికుల నిరసన


పాన్‌గల్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

పాన్‌గల్: పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలో రోడ్లను ఊడుస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ రాము మాట్లాడారు. కార్మికులు సమస్యల పరిష్కారం కోసం 31 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. జేఏసీ నాయకులు సుబ్బయ్య, అర్జునయ్య, బాలస్వామి, మద్దిలేటి, రంగాస్వామి, పక్కీరయ్య పాల్గొన్నారు.
పెబ్బేరు రూరల్: సీఐటీయూ జిల్లా సభ్యుడు పుట్టా ఆంజనేయులు దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపి వారితో కలిసి చెవుల్లో పువ్వులు పెట్టుకొని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గోపాలకృష్ణ, హన్మంతు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్ ధ్యేయం

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని రైతులను రాజులుగా చూడటమే సీఎం కేసీఆర్ ధ్యేయమని సర్పంచ్ కృష్ణవేణి అన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలు రూ.లక్ష మాఫీని ప్రకటించిన సందర్భంగా.. శనివారం మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చెన్నయ్య, శంకర్‌గౌడ్, కృష్ణయ్య, లక్ష్మయ్య, సత్యంగౌడ్, మల్లేష్, శేషయ్య, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.